క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్ ప్రశాంతం

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన సెషన్‌లో 67 మందికి 64 మంది హాజరవ్వగా ముగ్గురు గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 55 మందికి 55 మంది హాజరయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని వారు పేర్కొన్నారు.

ఆటిజంపై అవగాహన ర్యాలీ



నాగాయలంక: ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కె.పాలెం ప్రత్యేక అవసరత బాలలు పాఠశాల (భవిత కేంద్రం) ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వి.బాలయ్య మాట్లాడుతూ బాలల్లో వయస్సుకు తగ్గ మానసిక పరమైన ఎదుగుదల లేకుండా ఉండే స్థితిని ఆటిజం అంటారని, దీని వల్ల బాల్యం నుంచే నాడీ సంబంధ రుగ్మతలతో జీవితాంతం బాధ పడుతుంటారని వివరించారు. మూడు సంవత్సరాల లోపే ఇలాంటి పిల్లలను గుర్తించి వారికి సరైన వైద్య సదుపాయాలు అందించవచ్చన్నారు. పాఠశాల ఉపాధ్యాయిని కిశోరి కుమారి, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయునులు బేబీ శాలినీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



చల్లపల్లి: మచిలీపట్నంలో ఫిబ్రవరి 9వ తేదీన నిర్వహించిన ఇంటర్‌నేషనల్ టాలెంట్ రీసెర్చ్ ఒలింపియాడ్ లెవల్–2లో చల్లపల్లికి చెందిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డి.సురేష్ బుధవారం తెలిపారు. రెండో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకూ చదువుతున్న మొత్తం 224 మంది విద్యార్థులు ఈ టెస్టుకు హాజరు కాగా వీరిలో 174 మందికి ప్రతిభా అవార్డులు లభించినట్లు చెప్పారు. ఏడో తరగతి చదువుతున్న సిద్దెల శామ్యూల్‌రాజ్‌కు గ్రాండ్ ప్రైజ్ కింద ల్యాప్‌టాప్, ఐదో తరగతి చదువుతున్న వేములపల్లి యువన్ కార్తికేయ, ఎనిమిదో తరగతి చదువుతున్న గణపరెడ్డి వేద వైష్ణవిలకు మొదటి, రెండో బహుమతి కింద ట్యాబ్‌లు లభించాయన్నారు. ఇంకా 171 మందికి స్మార్ట్ వాచ్‌లు, హెడ్‌ఫోన్స్ వంటి వాటితో పాటు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు లభించినట్లు ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు.

డంపింగ్ యార్డులో మంటలు ఆర్పివేత



సాక్షి ఎఫెక్ట్

పెడన: డంపింగ్ యార్డులో మంటలను మునిసిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు బుధవారం ఆర్పించేలా చర్యలు తీసుకున్నారు. డంపింగ్ యార్డులో దట్టమైన పొగలు రావడంతో పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులు, వాహనాదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని 'పొగతో ఉక్కిరిబిక్కిరి' శీర్షికన బుధవారం 'సాక్షి'లో వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన మునిసిపల్ కమిషనర్ బుధవారం ఉదయం నుంచే ట్రాక్టర్లతో నీటిని తీసుకువెళ్లి పైపులు ద్వారా మంటలను అదుపులోకి తెచ్చి దట్టమైన పొగలు రాకుండా నిలువరించారు.

ప్రజా భాగస్వామ్యంతోనే సాధ్యం



పెడన: భద్రత విషయంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, అప్పుడే భద్రత మెరుగుపడుతుందని పెడన ఎస్‌ఐ జి. సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని మఠంవీధి వద్ద ఉన్న శ్రీవరసిద్ధి వినాయకుని గుడి వద్ద గుడి కమిటీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పట్టణంలోనే కాకుండా మండలంలోని ఆలయాలు వద్ద, ప్రధాన కూడళ్లలోని ఇళ్ల వద్ద, దుకాణాల్లోను సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. ఇప్పటికే చాలా చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. ఎక్కడైనా ఏమైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే నిఘా కెమెరాల ద్వారా దర్యాప్తు వేగవంతం చేసి నేరాలను అదుపులోకి తీసుకురావడానికి వీలు కలుగుతుందన్నారు.

• జారిపోతారు జాగ్రత్త!

ఈ చిత్రాలు చూస్తుంటే ఏవో మట్టి రోడ్లన్నట్లు ఉన్నాయి కదూ.. అలా అని మీరు అనుకుంటే ఎర్రటి ఎండలో చెప్పుల్లేకుండా 'ఇసుక'లో కాలేసి నట్లే! నిజమేనండి.. మీరు చూస్తున్న చిత్రాలు తారుతో వేసిన ఆర్‌అండ్‌బీ రోడ్లు. అయితే అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న ఇసుక రవాణా కారణంగా ఈ దారులన్నీ ఇలా తయారయ్యాయి. ఘంటసాల మండలం శ్రీకాకుళం రేవులో మూడు నుంచి నాలుగు పొక్లెయిన్ల ద్వారా ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లలో నింపి కరకట్ట మీదుగా వెలివోలు, నిమ్మగడ్డ, నడకుదురు, చల్లపల్లి ప్రాంతాల గుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో రోడ్లపై ఇసుక గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి ప్రయాణానికి అంతరాయం కలిగించడమే కాకుండా ప్రమాదాలకు కారకాలుగా మారుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడుపుతున్నారు. చిన్నపాటి బ్రేక్ వేసినా బండి జారిపోయి కిందపడి గాయాలపాలయ్యే దుస్థితి. కొన్ని చోట్ల అయితే గుట్టలు గుట్టలుగా ఇసుక పేరుకుపోయి బండ్లు నడవని పరిస్థితి నెలకొంది. పరిమితికి మించి ఇసుకను లోడు చేసుకోవటం వల్లే రోడ్లు ఇలా తయారవుతున్నాయని పలువురు చెబుతున్నారు. కనీసం రోడ్లపై పడిన ఇసుక మేటలను అయినా తొలగించి ప్రమాదాలను నివారించాలని వాహన చోదకులు వేడుకొంటున్నారు. – చల్లపల్లి


కరకట్టపై నిమ్మగడ్డ వద్ద పరిస్థితి


చల్లపల్లి–నడకుదురు రోడ్డులో శ్రీనగర్ అడ్డరోడ్డు వద్ద వాహనచోదకుల ఇబ్బందులు


నడకుదురు వంతెన వద్ద రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక


కరకట్టపై రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన ఇసుక గుట్టలు

పనిచేయని వెబ్‌సైట్

మచిలీపట్నంటౌన్: ఆస్తి, తాగునీటి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించేందుకు నగరపాలకసంస్థ కార్యాలయానికి వస్తున్న ప్రజలకు నిరాశ ఎదురవుతోంది. కార్యాలయంలోని రెవెన్యూ విభాగం వద్ద ఉన్న పన్నులు కట్టించుకునే కౌంటర్ తెరిచి ఉన్నా.. చెల్లింపులకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్‌ను రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి నిలిపివేసింది. సైట్ క్లోజ్ కావటంతో పన్నులు చెల్లించేందుకు వస్తున్న ప్రజలు విషయం తెలుసుకుని నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఈ నెల7 లేక 8వ తేదీ సైట్ ఓపెన్ అయ్యే అవకాశాలు ఉన్నాయని సిబ్బంది సమాచారం ఇస్తున్నారు. దూరప్రాంతాల నుంచి పన్ను చెల్లించేందుకు వస్తున్న వారికి ఇబ్బందులు తప్పటం లేదు.

జెడ్పీ హై స్కూల్‌కు ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ వితరణ

ఘంటసాల: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు తమవంతు సహకారం అందిస్తున్న దాతల సేవలు ఆదర్శనీయమని హెచ్‌ఎం శ్రీరంగవల్లి అన్నారు. ఘంటసాల హైస్కూల్ పూర్వ విద్యార్థి గ్రామానికి చెందిన యార్లగడ్డ విజయ సామ్రాట్ మరణించారు. ఆయన జ్ఞాపకార్థం వారి సోదరి వసుంధరాదేవి రూ.16,100 విలువైన పెద్ద ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్‌ను హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరంగవల్లికి బుధవారం అందించారు. మధ్యాహ్న భోజన పథకానికి ఉపయోగపడే రీతిగా ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్ అందించిన దాతలకు విద్యా కుటుంబం తరపున హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

'మెయిన్‌రోడ్డును పిల్లలు దాటాలంటే భయం సార్'

కలెక్టర్‌కు విన్నవించిన తల్లిదండ్రులు

పెడన: 'మెయిన్ రోడ్డు దాటి వెళ్లాలంటే చాలా భయంగా ఉంటుందని, రోజూ ఆ రోడ్డు దాటి బడికి వెళ్లడం చాలా కష్టమని' పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్ డీకే బాలాజీకి విన్నవించారు. బుధవారం రాత్రి ఆయన పట్టణంలోని ఆరో వార్డులో ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలను అధిగమించి పిల్లల భవిష్యత్తును చక్కదిద్దుకునే అవకాశం తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని, ఆ దిశగా అడుగులు ముందుకు వేసి పిల్లలను మోడల్ పాఠశాలలకు పంపించాలని కలెక్టర్ కోరారు. దీనిపై తల్లిదండ్రులు మాట్లాడుతూ తాము ప్రతి రోజు ఉదయమే ఆరు గంటలకు పనులకు వెళ్లిపోతామని, బడి దగ్గరగా ఉంది కాబట్టి బెల్ కొట్టగానే వారే వెళ్తున్నారని తెలిపారు. ఎక్కడో పాఠశాల పెడితే తామే నిత్యం తీసుకు వెళ్లాలని, అది చాలా కష్టమని వాపోయారు. తమ దగ్గర ఉన్న పాఠశాలనే మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దాలని తల్లులు కోరారు. మరొకసారి ఆలోచించుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు. కలెక్టర్‌తో పాటు డీఈవో రామారావు, డీవైఈవో శేఖర్ సింగ్, ఎంఈవోలు దుర్గారావు, హరనాథ్, తహసీల్దార్ అనిల్ కుమార్ తదితరులున్నారు.

మెరుగైన విద్య కోసమే..

బంటుమిల్లి: ప్రాథమిక స్థాయి నుంచే విద్యారంగంలో వస్తున్న పోటీతత్వాన్ని తట్టుకుని నిలబడేందుకు ప్రభుత్వం మోడల్ పాఠశాలలను అందుబాటులోకి తెస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండలంలోని పెదతుమ్మిడి పరిధిలో ఉన్న అర్థవానిగూడెం, కామాక్షిపురం, పెనుమాల గూడెం, పెదతుమ్మిడి మెయిన్ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడారు. వారు లేవనెత్తిన సందేహాలను, సమస్యలను నివృత్తి చేశారు. కలెక్టర్ వెంట డీఈవో పీవీజే రామారావు, ఎంఈవో బాలాత్రిపురసుందరీ పాల్గొన్నారు.


పెడనలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

చినపాండ్రలో కలెక్టర్ పర్యటన..

కృత్తివెన్ను: మోడల్ పాఠశాలల ఏర్పాటులో భాగంగా కృత్తివెన్ను మండలం చినపాండ్ర గ్రామంలో కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం పర్యటించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సమీపంలోని కేవీఆర్ నగర్ పాఠశాల నుంచి విద్యార్థులను ఎంపీపీ పాఠశాలలో చేర్చేందుకు ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు నిరాకరించడంతో దీనిపై వారితో ఆయన మాట్లాడారు. మోడల్ పాఠశాల విద్యార్థులకు ఒనగూరే ఉపయోగాలను, పాఠశాల ఆవశ్యకత, ప్రాముఖ్యతను ఆయన వివరించారు.

నేటి నుంచి సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నంటౌన్: సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలకు నగరంలోని రుస్తుంబాదలో వేంచేసి ఉన్న శ్రీ భద్రాద్రి శ్రీ రాముల వారి దేవాలయం ముస్తాబైంది. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి, గాలి గోపురానికి రంగులు వేసి, విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వై. శిరీష బుధవారం తెలిపారు. 3వ తేదీ గురువారం నుంచి 9వ తేదీ బుధవారం వరకూ ఉత్సవాలు జరుగుతాయని ఆమె తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనపూజ, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షా బంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, జగజ్యోతి, వైనతేయ పట ప్రతిష్ఠ వంటి పూజా కార్యక్రమాలతో కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 6వ తేదీ ఆదివారం ఉదయం 7.30 గంటలకు నిత్య హోమం, చతుస్థానార్చన, బలిహరణ, 10 గంటలకు శ్రీ భద్రాద్రి సీతారామ కల్యాణ మహోత్సవాన్ని కూనపరెడ్డి శ్రీ కృష్ణారావు దంపతులచే నిర్వహిస్తామన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు పానకం, వడపప్పు అందజేసి, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈఓ శిరీష తెలిపారు.


ముస్తాబైన రుస్తుంబాద భద్రాద్రి రామాలయం

తాగునీటి ఎద్దడిని నివారించండి

సర్వసభ్య సమావేశంలో అధికారులను కోరిన ఎంపీటీసీలు

కోడూరు: వేసవిలో తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీటీసీలు అధికారులను కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన ఈ సమావేశం జరగ్గా, పలువురు ఎంపీటీసీలు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. రామకృష్ణాపురం, సాలెంపాలెం, హంసలదీవి, వేణుగోపాలపురం, ఇరాలి, ఊటగుండం, చింతకోళ్ల, బసవానిపాలెం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీఓ సుధాప్రవీణ్ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. చెరువులను నింపుకొనేందుకు నీటిని విడుదల చేస్తారని, ఆ సమయంలో చెరువుల్లోకి నీటిని మళ్లించేందుకు అవసరమైన ఏర్పాట్లపై ముందుగానే చూసుకోవాలన్నారు. ప్రస్తుతం గ్రా మాల్లో జరుగుతున్న తడి, పొడి చెత్త సేకరణపై పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీల పరిధిలో జరిగే పనులకు సంబంధించి పలు తీర్మానాలు సభ ఆమోదించింది. తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎంపికైన దేవనబోయిన వెంకటేశ్వరరావును అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. జెడ్పీటీసీ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎంఈఓ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

ఘంటసాల: వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో డి.సుబ్బారావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సమస్యలపై బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 452 చేతి పంపులు ఉండగా 31 పంపులు మరమ్మతులు ఉన్నాయని గుర్తించామన్నారు. వీటికి మూడు రోజుల్లో మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం దేవరకోట, లంకపల్లి గ్రామాల్లో పర్యటించిన ఎంపీడీవో తాగునీటి సురక్షిత పథకం వాటర్ ట్యాంకులను పరిశీలించి తాగునీటి సరఫరా సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయింపునకు అంచనాలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.సుగుణ కుమారిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అవనిగడ్డ:అవనిగడ్డలో అక్రమంగా తరలిస్తున్న 1,650 కేజీల రేషన్ బియ్యాన్ని ఎస్‌ఐ శ్రీనివాస్ బుధవారం పట్టుకున్నారు. రాబడిన సమాచారం మేరకు కటికల రామారావు నుంచి కోసూరు రాజారావు కొనుగోలు చేస్తుండగా ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నగరపాలక సంస్థకు తాగునీటి కష్టాలు!

- కార్యాలయంలో పనిచేయని ఆర్వో ప్లాంట్
- తరచూ మరమ్మతులకు గురవుతున్నా పట్టించుకోని వైనం

మచిలీపట్నంటౌన్: నగర ప్రజల దాహార్తిని తీర్చే నగరపాలకసంస్థకే తాగునీటి కష్టాలు వచ్చాయి. అనునిత్యం కమిషనర్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది కొలువుండే కార్యాలయంలోనే తాగునీటి కష్టాలు తరచూ ఎదురవుతున్నాయి. తాగేందుకు గుక్కెడు నీటి కోసం కార్యాలయంలోని అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయానికి వివిధ పనులకు వచ్చే ప్రజలకు కూడా తాగునీటి కష్టాలు తప్పటం లేదు.

పనిచేయని ఆర్వో ప్లాంట్..

కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది, ప్రజల దాహార్తిని తీర్చేందుకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ప్రస్తుతం మరమ్మతులకు గురైంది. ఈ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసిన నాటి నుంచి కొద్ది నెలలకే మరమ్మతులకు గురవుతూ వస్తోంది. దీనికి మరమ్మతులు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు పూర్తి చేసేందుకు నెలల కాలం పడుతోంది. దీంతో కార్యాలయంలో తరచూ తాగునీటి కష్టాలు తప్పటం లేదు. గత 20 రోజుల క్రితం ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురయ్యింది. దీంతో కార్యాలయంలోని పలు విభాగాల సిబ్బంది బయటి నుంచి క్యాన్‌ల ద్వారా నీటిని తెచ్చుకుని పొదుపుగా వాడుకొంటున్నారు. బయటి నుంచి తెచ్చుకొని వారు బాటిళ్లతో నింపుకుంటున్నారు. ఉద్యోగులు, సిబ్బంది మధ్యాహ్నం భోజనం చేసేందుకు తాగునీరు లేక ఇంటి నుంచి లేదా బయటకెళ్లి దుకాణాల వారి వద్ద నీటిని తెచ్చుకుంటున్న పరిస్థితి ఇక్కడ ఉంది.

త్వరలోనే పరిష్కారం..

దీనిపై ఏఈ గోపిశెట్టి శేఖర్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఇది బోరు సమస్య అన్నారు. నూతన బోరు వేశామని, అయితే మోటర్ పని చేయటం లేదని, త్వరలోనే నూతన మోటార్‌ను బిగించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.


మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్


వృథాగా కుళాయి

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

చల్లపల్లి: సబ్సిడీ రుణాలకు అర్జీలు పెట్టుకున్న వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.వెంకటరమణ ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించారు. చల్లపల్లి మండలంలో మొత్తం 11 గ్రామ పంచాయతీలకు 71 యూనిట్లకుగానూ రూ.1.89కోట్ల రుణాలను కేటాయించారు. ఇందుకోసం మండలంలో అన్ని గ్రామాల నుంచి మొత్తం 516 మంది అర్జీలు పెట్టుకున్నారు. మొదటి రోజు ఆముదార్లంక, చీడేపూడి, లక్ష్మీపురం, మాజేరు, మంగళాపురం, నడకుదురు, పాగోలు, పురిటిగడ్డ, వక్కలగడ్డ, వెలివోలు, యార్లగడ్డ గ్రామాలకు చెందిన 270 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉండగా వారిలో 209 మంది మాత్రమే వచ్చారు. 61 మంది గైర్హాజరయ్యారు. గురువారం చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 246 మంది అభ్యర్థులకు చెందిన దరఖాస్తులను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీవో చెప్పారు.

ఘంటసాలలో..

ఘంటసాల: మండలంలో కాపు, బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బుధవారం మాట్లాడుతూ ఆయా కార్పొరేషన్ల ద్వారా 62 యూనిట్లకు గాను 360 దరఖాస్తులు వచ్చాయన్నారు.

మోపిదేవిలో..

మోపిదేవి: వివిధ కార్పొరేషన్ల కింద దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 4వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వర్ణభారతి తెలిపారు. మండలంలోని 13 పంచాయతీల నుంచి 476 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు..

నాగాయలంక: మండలంలో 2024–25 సంవత్సరానికి బీసీ యాక్షన్ ప్లాన్ కింద వివిధ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 3, 4 తేదీల్లో ఇంటర్వ్యూలు చేయనున్నట్లు స్థానిక ఎంపీడీఓ సుధాప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాగాయలంక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి బీసీ లబ్ధిదారులకు, 4న కాపు, కమ్మ, రెడ్డి, వైశ్య, ఈబీసీ, లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు చేస్తారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్(రవాణా సెక్టార్ ఎంచుకున్న వారు) ఒరిజినల్స్‌తో మండల పరిషత్ కార్యాలయానికి హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.


అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

అమ్మా భవానీ.. అందుకో నివేదన


ఆలయ ప్రాంగణంలో పాలపొంగళ్లను సిద్ధం చేస్తున్న మహిళలు


పాలపొంగళ్లను అమ్మవారికి సమర్పించడానికి వస్తున్న మహిళలు

కోడూరు: స్థానిక గంగాభవానీ అమ్మవారికి బుధవారం పాలపొంగళ్లతో మహానివేదన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారి 50వ జాతరోత్సవాలను పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో పాలపొంగళ్ల తయారు చేసేందుకు వీలుగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేయడంతో, ఉదయం 7గంటల నుంచే మహిళలు వేలాదిగా తరలివచ్చారు. సుమారు నాలుగు వేల మంది మహిళలు ఆలయం వద్దే పాలపొంగళ్లను సిద్ధం చేసి అమ్మవారికి నివేదించారు. దీంతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. ఆలయ కమిటీ పిలుపుతో హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై ప్రాంతాల నుంచి కోడూరు ప్రాంత మహిళలు తరలివచ్చి ఈ పాలపొంగళ్ల నివేదనలో పాల్గొన్నారు.

నేడు మహాచండీయాగం..

జాతరోత్సవాల నేపథ్యంలో గురువారం ఆలయం వద్ద మహాచండీయాగాన్ని నిర్వహించనున్నట్లు ధర్మకర్త కోట యుగంధరరావు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు చండీయాగం ఉంటుందన్నారు. అనంతరం మహాపూర్ణాహుతిని జరిపి, 25వేల మందికి అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు. అమ్మవారి మూలమూర్తికి 1,01,108 గారెలతో మహానివేదన జరపనున్నట్లు యుగంధరరావు చెప్పారు.

శ్రీకాకుళేశ్వరుని సేవలో..

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో వేంచేసియున్న శ్రీకాకుళేశ్వర స్వామి వారిని ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా ఆలయార్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ కనకదుర్గను కూటమి శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), మాజీ ఎంపీటీసీ సీతారామరాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

లంకమ్మవారి హుండీ ఆదాయం రూ.4.95లక్షలు

అవనిగడ్డ: స్థానిక లంకమ్మవారి హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. మొత్తం రూ.4,94,306 ఆదాయం వచ్చినట్లు ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. కొబ్బరిచిప్పలు పోగుచేసేందుకు బహిరంగ వేలం పాట నిర్వహించగా పాటదారులు ఎవరూ ముందుకు రాలేదని చెప్పారు. లడ్డూ ప్రసాదం అమ్ముకునేందుకు వేలంపాట నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు పోటీపడ్డారని, కోడూరుకు చెందిన అర్జా ఉమామహేశ్వరరావు రూ.38వేలకు పాటను కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

గూడూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పుట్టి మహాలక్ష్మయ్య, జేజమ్మలు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్యూరిఫైయర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. రామరాజుపాలెం, ఐదుగుళ్లపల్లి గ్రామాల్లో రూ.43.60లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామ సచివాలయ భవనాలను, రామన్నపేటలో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. డీసీ చైర్మన్ పోతన వెంకట లక్ష్మీనరసింహస్వామి, సర్పంచి పరసా రాజులు గూడూరు, మల్లవోలు గ్రామాల్లో చలివేంద్రాలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు.

పేకాట శిబిరంపై దాడి

ఘంటసాల: పేకాట, కోడి పందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారు నిఘా కెమెరాల నుంచి తప్పించుకోలేరని ఎస్‌ఐ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. ఘంటసాల మండలం పాపవినాశనం పరిధిలోని కృష్ణా కరకట్ట దిగువన పేకాట ఆడుతున్నట్లు అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీకి వచ్చిన విశ్వసనీయ సమాచారంతో బుధవారం డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేశారు. ఈ నిఘాలో పాపవినాశనంలో పేకాట ఆడుతున్నట్లు డ్రోన్ కెమెరాలో గుర్తించగా ఘంటసాల ఎస్‌ఐ కె.ప్రతాప్ రెడ్డి పోలీసు సిబ్బందితో వెళ్లి పేకాట శిబిరం దాడి చేసి 8 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకోవడంతో పాటు రూ.740ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.